

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 01 ఆగస్టు 2026 పేజీలు : 04


# గ్రామీణ విద్యార్థులకు విద్యాచక్రం కానుకగా సైకిళ్లు పంపిణీ

**- విద్యార్థుల భవిష్యత్తుకు అండగా సేవా దృక్పథంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు - చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యమని వెల్లడి**





**ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే , విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.**

**బ్రహ్మసముద్రం జూలై 31 ప్రభాతవార్త**

బ్రహ్మసముద్రం మండలం గుండుగానిపల్లిలో విద్యాచక్రం సైకిళ్ల పంపిణీ కార్యక్రమం మండల కన్వీనర్ పాలమండ్ల శ్రీరాముల అధ్యక్షతన నిర్వహించిన విద్యా చక్రం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా, వారి విద్యాభ్యాసం సులభతరం కావాలనే సేవా దృక్పథంతో విద్యాచక్రం కానుకగా సైకిళ్లను అందిస్తున్నట్లు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి భైరసముద్రం గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల సమక్షంలో సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల ప్రచార సమయంలో అనేక గ్రామాల్లో విద్యార్థులు బరువైన పుస్తకాల బ్యాగులు మోసుకుని కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలు తనను తీవ్రంగా కలిచివేశాయని అన్నారు. ఆ రోజే వారి ప్రయాణ కష్టాలను తగ్గించి, చదువుపై మరింత ఆసక్తి పెంచేలా ఏదైనా చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు విద్యకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ సైకిళ్ల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, ఒకే కుటుంబంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఖితల్లికి వందనంఖి పథకం వర్తింపజేస్తూ హామీని అమలు చేసిందన్నారు. గతంలో అమ్మఒడి పథకానికి రూ.5,500 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం తల్లికి వందనం పథకానికి రూ.10,190 కోట్లు కేటాయించి ప్రతి అర్హ తల్లి ఖాతాలో నేరుగా జమ చేయడం ద్వారా ప్రభుత్వ నిబద్ధత చాటుకుందని తెలిపారు. అలాగే 30 వేల మంది అంగన్వాడీ టీచర్లను కూడా ఈ పథకంలో భాగస్వాములను చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని 114 చెరువులను డిటిపి కెనాల్ ద్వారా వచ్చేదనం పెంపొందించే సస్యశ్యామలం చేయాలని గెలిచిన రెండున్నర సంవత్సరాల లో భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు సాగును అందిస్తానని హామీ ఇచ్చిన కొన్ని అనివార్య కారణాలవల్ల గత ప్రభుత్వ అలసత్వం వల్ల రైతులకు ఎంత భూమి కోల్పోయారు దానికి పరిహారం ఎంత అన్నది తేల్చకుండా గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేస్తూ భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు సాగునీరు అందించే పనులు ఆలస్యం అయ్యాయని పేర్కొన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్ట్ క్యాలెండర్లలో ఇచ్చిన హామీ మేరకు 2028 సంవత్సరంలోపు భైరవాణి తిప్పా ప్రాజెక్టుకు సాగునీరు అందిస్తానని అన్నారు. భైరసముద్రం గ్రామంలో స్వయంగా సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహ కట్టకు మెరుగులు దిద్దేందుకు 50,000 అందించిన ఎమ్మెల్యే వైసీపీ ప్రభుత్వంలో ఉన్న రహదారులకు అక్కడక్కడ పడిన చిన్నపాటి గుంతలు కూడా పుడ్చకుండా అరకొరగా ఉన్న రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి నేడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మా ప్రాంతం చాలా వెనుకబడింది గ్రామీణ రహదారులు లేక రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పగ మిగతా 3 లో...






## ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

**- జిల్లాలో మొత్తం ఓటర్లు 17,90,436**
**- పురుష ఓటర్లు 8,83,174 మంది.. మహిళా ఓటర్లు 9,07,053 మంది.. ట్రాన్స్ జెండర్లు 209 మంది**
**- ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నయెడల, క్లైములు మరియు అభ్యంతరములు జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు**
**- జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్**



**ఓటర్ల జాబితా విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

**అనంతపురం కలెక్టరేట్ జూలై 31 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ విడుదల చేశారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసి జాబితా ప్రతులను జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఈఆర్ఓలకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరిగిందని, ఇందుకు సంబంధించి జిల్లాలో మొత్తం ఓటర్లు 17,90,436 మంది ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,83,174 మంది, మహిళా ఓటర్లు 9,07,053 మంది ట్రాన్స్ జెండర్లు 209 మంది ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 2,48,087 మంది ఓటర్లను ఏ.ఎస్.డి.డి క్రింద తొలగించడం జరిగిందని, వాటిలో ఆచూకీ తెలియని ఓటర్లు 46,276 , శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు 79,582, మరణించిన ఓటర్లు 75,378 , రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు మిగతా 3 లో...

### సచివాలయం ఉద్యోగులు ఎప్పుడొస్తారో...

## వార్డెన్లకు పని భారం ఎప్పుడు తగ్గుతుందో ?

**- ఒకే వార్డెన్ కు మూడు హాస్టల్స్ బాధ్యతలు**
**- మరికొందరికి అదనంగా మరొక హాస్టల్ అప్పగింత**
**- పని భారంతో సతమతమవుతున్న వార్డెన్లు**
**- ఇది బీసీ హాస్టల్స్ వార్డెన్ల పరిస్థితి**

**అనంతపురం న్యూటౌన్, జూలై 31 ప్రభాతవార్త**

**ఒక వార్డెన్ కు ఒక హాస్టల్ బాధ్యతలు సాధారణం. కానీ అదనంగా మరో రెండు హాస్టల్ బాధ్యతలు అప్పగించడం, మరికొందరికి అదనంగా మరో హాస్టల్ బాధ్యతలు అప్పగించడంతో పని భారం పెరిగింది. పని భారం తగ్గించడానికి సచివాలయంలో మిగిలి ఉన్న ఉద్యోగులను డిప్యూటేషన్ పై జిల్లాకు అలాట్ చేసినప్పటికీ చాలామంది జాయిన్ కాలేదు. ఈ విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం.**



అనంతపురం జిల్లా బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 55 హాస్టల్స్ ఉన్నాయి. అందులో 29 మంది వార్డెన్లు మాత్రమే ఉన్నారు. ఇంకా 26 హాస్టల్స్ కు వార్డెన్లు లేరు. దీంతో ఉన్న వార్డెన్లకు అదనంగా ఒకటి, రెండు హాస్టల్స్ బాధ్యతల్ని అప్పగించారు. ఇలా అదనపు బాధ్యతలు అప్పగించడం వలన పని భారంతో సతమతవుతున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం గుర్తించండి. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో మిగిలి ఉన్న వీఆర్వో, మహిళ పోలీస్ ఉద్యోగులను గుర్తించి జిల్లాలకు అలాట్మెంట్ చేస్తూ బీసీ సంక్షేమ శాఖ జూన్ లో ఉత్తర్వులు జారీ చేసింది. అందులో అనంతపురం జిల్లాకు 15 మంది అలాట్ అయ్యారు. అందులో అందులో ఒకరికి ఆరోగ్య సమస్యలు కారణంగా విల్లింగ్ ఇవ్వలేదు. అయితే మిగిలిన 14 మందిని రిలీవ్ చేయాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కు ఫైలు పంపించడం జరిగింది. అయితే బిఎల్ఓల డ్యూటీలులేని ఒక ఉన్న వీఆర్వో, ఇద్దరు మహిళా పోలీసులను రిలీవ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ముగ్గురిలో ఒకరికి జిల్లా కేంద్రంలో బీసీడీఎస్ టీహాస్టల్, మరొకరికి తాడిపత్రి బీసీబాలికలహాస్టల్, మరొకరికి జూటూరు బీసీహాస్టల్ కేటాయిస్తూ జిల్లాకలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక మిగిలిన 11 మందిని రిలీవ్ చేయలేదు. జూలై 24వ తేదీతో బి ఎల్ ఓ డ్యూటీలు పూర్తి అయ్యాయి. కానీ ఇప్పటికీ ఆ 11 మందిని రిలీవ్ చేయలేదు.

**ఒకే వార్డెన్ కు మూడు హాస్టల్స్:**

జిల్లాలో ఉరవకొండ బీసీ బాలుర కళాశాల హాస్టల్ వార్డెన్గా పనిచేస్తున్న ఈరన్న కు అక్కడే మరొకటి బీసీ బాలుర హాస్టల్ బాధ్యతలు అప్పగించారు. ఇవి కాకుండా మరొకటి ఆమిద్యాల బీసీ బాలుర హాస్టల్ బాధ్యతలు కూడా అదనంగా అప్పగించారు. ఇలా మూడు హాస్టల్ బాధ్యతలు అప్పగించారు. మరికొందరికి రెగ్యులర్ హాస్టల్ తో పాటు మరొకటి అదనంగా అప్పగించారు. కొందరు అదనపు బాధ్యతలను తిరస్కరించడంతో ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ వార్డెన్లకు బీసీ హాస్టల్స్ బాధ్యతలు అప్పగించారు. అయితే అదనపు బాధ్యతలు వలన పని భారం పెరగడంతో సతమతమవుతున్నారు. మరికొందరైతే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రస్తుతము పలు యాప్లను ప్రభుత్వం తీసుకురావడంతో కొందరికి టెక్నికల్ గా అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఒక అనంతపురం జిల్లాలోనే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అందువలన ఈ సమస్యపై బీసీ సంక్షేమ శాఖ తోపాటు జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లాకు అలాట్మెంట్ అయిన సచివాలయం ఉద్యోగులను రిలీవ్ చేసి హాస్టల్స్ కేటాయించి, వార్డెన్ లకు పని భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు బీసీ హాస్టల్స్ వార్డెన్లు కోరుతున్నారు. అయితే దీనిపై ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే. దీనిపై వివరణ అడగడానికి బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి కి ఫోన్ చేస్తే స్పందించలేదు.

## ఆగస్టు 15 వరకు పిఎంఎఫ్‌బివై పథకం గడుగు పెంపు

### జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి, జూలై 31, ప్రభాతవార్త**

జిల్లా రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఎన్రోల్మెంట్ కి గడువు ఆగస్టు 15 వరకు పొడిగించబడినదిని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శాంప్రసాద్ తెలిపారు. ఈ పథకం కింద ముఖ్యంగా కంది మొక్కజొన్న ఆముదము రాగి, వరి పంటలు ఉన్నాయని కంది పంటకు ఎకరానికి 102 రూపాయలు, మొక్కజొన్న పంటకు ఎకరానికి 165 రూపాయలు, ఆముదం పంటకు ఎకరానికి 100 రూపాయలు, రాగి పంటకు ఎకరానికి 100 రూపాయలు అలాగే వరి పంటకు ఎకరానికి 200 రూపాయలు ప్రీమియం చెల్లించి వెంటనే రైతులు పంటల బీమా పథకంలో ఆగస్టు 15వ తేదీ లోపల ఎన్రోల్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లా రైతాంగ శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ లో ఉన్న అసైన్డ్ ల్యాండ్స్ కూడా ఇన్సూరెన్స్ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఇన్సూరెన్స్ చేసుకొని ఫ్రీ హోల్డ్ లో అసైన్డ్ లాండ్స్ ఉన్న రైతులందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటలను ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులందరికీ అవగాహన కల్పించి అర్హత ఉన్న అందరు రైతులు పంటల బీమా కట్టుకునేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద 21 868 హెక్టార్లు వాతావరణ ఆధారిత బీమా పథకం కింద 106023 హెక్టార్లు నమోదు చేయించుకోవడం జరిగిందన్నారు.

## నా నరాల్లో ఉండేది రక్తం కాదు డీజిల్

**- వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో రూ.420 కోట్లు నష్టపోయా**
**- ప్రైవేట్ ట్రావెల్స్ మధ్య టికెట్ల ధరల తగ్గింపుపై ఆగ్రహం**
**- మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి**



**మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి**

**తాడిపత్రిఅర్బన్, జూలై 31 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆపరేటర్ల మధ్య టికెట్ ధరల యుద్ధంపై తాడిపత్రి మాజీ జె.సి ప్రభాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 99 రూపాయలకే ప్రయాణికులను తీసుకెళ్తూ మార్కెట్‌ను నాశనం చేస్తున్నారని విమర్శించిన ఆయన "నా నరాల్లో పారేది రక్తం కాదు.. డీజిల్" అంటూ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రవేట్ ట్రావెల్స్ బస్సు యజమానులకు హీట్ ఎక్కిస్తోంది. తాడిపత్రిలోని జె.సి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ బస్సు యజమానులు ఇష్టానుసారంగా టికెట్ ధరలు తగ్గించడం వల్ల మొత్తం ట్రావెల్స్ రంగం తీవ్ర సంక్షోభంలో పడుతోందని జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అందరూ ఒకే విధానంలో టికెట్ ధరలు నిర్ణయించి, నిర్వహణ ప్రమాణాలను కూడా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా తనకు బస్సు వ్యాపారంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ "నా నరాల్లో పారేది రక్తం కాదు.. డీజిల్" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఇటీవలే కోటిన్నర రూపాయలు వెచ్చించి ఎలక్ట్రిక్ బస్సులు కూడా కొనుగోలు చేశానన్నారు. గత ప్రభుత్వ హయాంలో తన ట్రావెల్స్ వ్యాపారం తీవ్రంగా దెబ్బతిందని, దాదాపు 420 కోట్ల నష్టం వాటిల్లినా ఎవరి దగ్గరా చేయి చాపలేదని, తన పిల్లలు, దేవుడి దయ వల్లే నిలబడ్డానని చెప్పారు. ఇతర బస్సు యజమానులకు ఆగస్టు నెలాఖరు వరకు గడువు ఇస్తున్నానని, అప్పటిలోగా అందరూ ఒకే తాటిపైకి వచ్చి టికెట్ రేట్లు, నిర్వహణపై ఉమ్మడి మిగతా 3 లో...

## డిఎస్సీ నియామకాలపై సిబిఐ విచారణ జరిపించాలి

**- నైతిక బాధ్యత వహించి మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలి - వైసిపి ముఖ్య నేతల డిమాండ్**





**జాయింట్ కలెక్టర్‌కు వివరిస్తున్న వైసిపి ముఖ్య నేతలు , విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత**

**అనంతపురం సిటీ, జూలై 31 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన డిఎస్సీ నియామకాలలో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. డిఎస్సీ 2025 నియామకాలపై విచారణ చేపించాలని డిమాండ్ చేస్తూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో పార్టీ ముఖ్య నేతలు జాయింట్ కలెక్టర్ ఎస్‌పి చరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, సమన్వయ కర్తలు సాకే శైలజానాథ్, విశ్వేశ్వర్‌రెడ్డి, మిగతా 3 లో...

## దీర్ఘ కాలిక సమస్యలకు చెక్..

### ఇంటింటా కూటమిలో - ఎమ్మెల్యే..

**అనంతపురం క్రైమ్ జులై 31 ప్రభాతవార్త**



**ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, శ్రేణులు**

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 20 నుంచి 30ఏళ్లుగా ఉన్న సమస్యలకు రెండేళ్లలో పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 39వ డివిజన్ లక్ష్మీనగర్ లో పర్యటించారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందాయా.. డివిజన్‌లో ఇంకా ఏమైనా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలా అని అడుగుతూ ముందుకు సాగారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటికి మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మా పాలనపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. రెండేళ్లలోనే మౌళిక వసతులకు నియోజవర్గంలో 200కోట్లు ఖర్చు చేశామన్నారు. 1296కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. 20ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. 39వ డివిజన్ లో మాత్రమే కోటి రూపాయలతో వివిధ కార్యక్రమాలు చేసినట్టు వివరించారు. 20లక్షలతో ముస్లిం మైనార్టీలకు కమ్యూనిటీ భవనం నిర్మించినట్టు చెప్పారు. రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో డంపింగ్ యార్డుల్లో లక్ష టన్నుల చెత్త పెట్టిపోయారన్నారు. ఇప్పటికే 80శాతం వరకు తమ ప్రభుత్వం దానిని తొలగించిందన్నారు. నగరానికి డంపింగ్ యార్డు పెద్ద సమస్యగా మారిందని.. అందుకే తమ ప్రభుత్వం వచ్చాక.. దానిని తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే 80శాతం పైగా పూర్తైందని అక్టోబర్2 నాటికి చెత్త లేకుండా చేసి అక్కడ ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మిగిలిన స్థలంలో పార్కు నిర్మించబోతున్నామని వివరించారు. నగరంలో స్మార్ట్ సిటీతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ఏర్పాటు చేసి విద్యుత్ బిల్లులు ఆదా చేస్తున్నట్టు వెల్లడించారు. నడిమివంక, మరువ వంకకు ప్రొటెక్షన్ వాల్స్, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామన్నారు. కొత్త పింఛన్లు కావాలని చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారని.. త్వరలోనే వాటిని మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం కేవలం బటన్లు నొక్కి ప్రజల్ని మభ్య పెడితే తాము ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ చేపల హరి, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, టిడిపి నాయకులు రాయల్ మధు, ఇస్మాయిల్, ఓంకార్ రెడ్డి, కరీం, తదితరులు పాల్గొన్నారు.

## పడకేసిన వ్యవస్థ..పట్టని అవస్థ..!

**- రూ.లక్షల నిధులు ఖర్చుచేస్తున్నా కదలని మురుగు - మురుగు పారదు..అనారోగ్యం తప్పదంటున్న జనం**





**సినిమా థియేటర్ వెనుక వీధిలో అధికారులను వెక్కిరిస్తున్న మురుగు , సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో తాగునీటి పైపులను చుట్టేసిన చెత్త**



**సినిమా థియేటర్ పక్కవీధిలో అగమ్యగోచరంగా మారిన అపరిశుభ్రత**

**యాడికి(తాడిపత్రి), జులై 31,ప్రభాతవార్త:**

యాడికి మేజర్ పంచాయతీ పరిధిలో మురుగునీటి వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఏటా రూ.లక్షల్లో నిధులు ఖర్చు చేస్తున్నా ప్రజా ప్రయోజనం శూన్యమేనని జనం పెదవి విరుస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు మరుగుతున్నా అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు. తాగునీటి పైపులైన్ల ద్వారా నీటితో పాటు దుర్వాసన వస్తోందని స్థానికులు గగ్గోలు పెడితే ఇటీవల కొండకింద వీధిలో దాదాపు రూ. 0.50 లక్షలు పంచాయతీ నిధులు ఖర్చు చేసి పనులు చేపట్టారు. పంచాయతీ నిధులతో పాటు అధికారుల పేర్లు చెప్పి కొందరు దళారులు ఇంటింటికి రూ. 500 లు వంతున 15 కుటుంబాలతో వసూలు చేశారు. ప్రస్తుతం తిరిగి అదే సమస్య పునరావృతం కావడంతో నిధులు గుళ్ల..పనులు డొల్ల అనేదుస్థితి ఏర్పడింది. సినిమా థియేటర్ వెనుక, పక్కవీధిలో రోడ్డెక్కిన మురుగుతో ఎలా అడుగు వేయాలో అధికారులే చెప్పాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలువ నిర్మాణం కోసం తవ్వివదిలేసిన చర్యలతో మరింత మురుగు నిల్వ ఉండి అనారోగ్యాలు తెచ్చిపెడుతోందని వీధివాసులు వాపోతున్నారు. దుర్వాసన, దోమల బెడదతో ఇళ్లలో ఉండలేకున్నాం.. ఇళ్లు వదిలేసి వెళ్లలేకున్నాం అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటలు కాదు, రోజులు మిగతా 3 లో...

## శివాలయం అభివృద్ధికి రూ.10.116 అందించిన ఎంపి డి ఓ

బ్రహ్మసముద్రం జులై 31 ప్రభాతవార్త


విరాళ మందిస్తున్న ఎంపీడీవో

బ్రహ్మసముద్రం మండలపరిధి లోని గుండి గాని పల్లి గ్రామము నందు వెదవతి నది తీరాన వెలసిన ఈశ్వర దేవాలయంనకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏకాం బరేశ్వరయ్య వారి వివాహ వార్షి కోత్సవ సందర్భంగా గుండి గాని పల్లి శివాలయం అభివృద్ధి కొరకు రూ.10,116 రూపాయలు అందజే యడం జరిగినది. ఈ సందర్భంగా ఎంపిడిఓకు ఆలయకమిటి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేయడం జరిగింది.

## ఆసుపత్రి సూపరింటెండెంట్ గా ఆఫ్తాబ్

హిందూపురం టౌన్ జూలై 31 ప్రభాతవార్త


డాక్టర్ ఆఫ్తాబ్

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ గా డాక్టర్ అఫ్తాబ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఛాంబర్ లో డాక్టర్ ఆఫ్తాబ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆఫ్తాబ్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని, ఆసుపత్రి అభివృద్ధికి, రోగుల భద్రతకు పెద్దపీట వేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలోని పలువురు నాయకులు, ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు, వైద్యులు, సిబ్బంది, డాక్టర్ ఆఫ్తాబ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే కార్యక్రమం విజయవంతం చేయండి

డి.హిరెహాళ్ జులై 31 ప్రభాతవార్త


తెదేపా మండల ఉప కార్యదర్శి

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కు హాజరుకానున్న ప్రభుత్వ విప్, రాయదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెదేపా నాయకుడు, తెదేపా మండల ఉప కార్యదర్శి కళ్యం తిప్పేస్వామి తెదేపా శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతు శనివారం డి.హిరెహాళ్ మండలం హులికల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని హులికల్లు, కళ్యం గ్రామాలలో చేపట్టనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగ పాల్గొంటారని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పథకంలో అర్హులైన వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎమ్మెల్యే చేతుల మీదుగ పింఛన్ల సొమ్ము అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్న పింఛన్లతో లబ్ధిదారులకు పింఛను సొమ్ము ఎలా ఉపయోగపడుతుంది తదితర అంశాలను ఎమ్మెల్యే లబ్ధిదారులతో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమం, ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ఎంపిటీసిలు, గ్రామ నాయకులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, బి.ఎల్.ఎ లు, యూనిట్ ఇంఛార్జిలు, పార్టీ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విన్నవించారు.

## తిమ్మాపురంలో తొలిసారి పర్యటన

సమస్యల పరిష్కారంపై గ్రామస్తుల ఆశలు

కంబదూరు, జూలై 31, ప్రభాతవార్త

కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అమిలినేని





నేడు ఎమ్మెల్యే అమిలినేని పర్యటన

సురేంద్రబాబు శనివారం కంబదూరు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో తొలిసారిగా పర్యటించనున్నారు. గ్రామీణ విద్యార్థులకు "విద్యా చక్రం" కార్యక్రమం కింద ఉచిత సైకిళ్ల పంపిణీ చేయనుండగా, తిమ్మాపురం, ములకనూరు, పాళ్లూరు గ్రామాల్లో కూడా ఆయన పర్యటన కొనసాగనుంది. ఈ సందర్భంగా తమ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. తిమ్మాపురం గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని స్థానికులు చాలా కాలంగా కోరుతున్నారు. అలాగే కదిరి దేవరపల్లి, అండేపల్లి దేవరమాన్ల నుంచి తిమ్మాపురానికి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరనున్నారు. అదే విధంగా తిమ్మాపురంలో ఎన్నో సంవత్సరా లుగా మూతపడిన ఆనంద నిలయం వసతి గృహంను పునరుద్ధరించి తిరిగి ప్రారంభించాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు. గ్రామ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. పాళ్లూరు గ్రామంలో సచివాలయ భవనం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో అది అసంపూర్తిగా ఉంది. దీనిని పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు సర్వీసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను వేడుకుంటున్నారు. ములకనూరు ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల ఆదరణ పొందుతున్నారు. ఇదే క్రమంలో తిమ్మాపురం, పాళ్లూరు, ములకనూరు గ్రామాల్లోని దీర్ఘకాలిక సమస్యలపైనా ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పర్యటనతో ఈ గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## కుల వివక్షతను రూపుమాపుదాం

- ఏఎస్పి మహేష్

లేపాక్షి, జులై 31 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పి మహేష్

నేటి ఆధునిక సమాజంలో కుల వివక్షతను రూపుమాపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఎస్పి మహేష్ పేర్కొన్నారు. లేపాక్షి ఎస్సి కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే జరిగింది. ఎస్ఐ నరేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్పి మహేష్‌తో పాటు హిందూపురం రూరల్ సిఐ జనార్దన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పి మాట్లాడుతూ సమాజంలో ఎక్కువ తక్కువ అన్న భేదాభిప్రాయాలు విడనాడాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ చిన్ననాడు అనేక కష్టాలు పడి విద్యను అభ్యసించి భారతదేశంలో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలను సంపాదించాలన్నారు. ఎక్కడైనా కుల వివక్షత చూపితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వన్నూరప్ప, విఆర్ఓ రాజేష్‌లతో పాటు అధిక సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## హిందువులు ముస్లింలు కలిసి నమాజ్


హిందువులు ముస్లింలు కలిసి వర్షం కోసం నమాజ్ చేస్తున్న దృశ్యం

రొళ్ల జూలై 31 ప్రభాతవార్త

వానకాలం ప్రారంభం నుంచి నేటి వరకు సరైన వర్షాలు కురవక పోవడంతో వర్షం కోసం ముస్లింలు హిందువులు కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రొళ్ల మండలం ఆవినకుంట ముస్లిం పెద్దలు, హిందువులు కలిసి గ్రామం శివారులోని పంట పొలాల్లో వెళ్లి ప్రత్యేక నమాజ్ చేశారు. సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తలంచి అందరి బాగుకోసం ఈ ప్రార్థనలు చేసినట్లు వారు పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖశాంతులతో ఉండాలని వాన దేవుడిని ప్రార్థించామన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : తహాశీల్దార్

రొళ్ల జూలై 31 ప్రభాతవార్త


చట్టాలను ప్రజలకు వివరిస్తున్న తహాశీల్దార్

చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రొళ్ల తహాశీల్దార్ చంద్రశేఖర్ ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని హెచ్ది హళ్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ప్రజలతో మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలని, సక్రమంగా అందేలా చూడాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలు ఏమైనా ఉన్నాయా, కుల దూషణలు జరుగుతున్నాయా, ఎంతమందికి చట్టంపై అవగాహన ఉంది అనే అంశాలను ప్రజలను అడిగి అధికారులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, వీఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఆర్డీవోకు ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ వినతిపత్రం

కళ్యాణదుర్గం టౌన్, జూలై 31 , ప్రభాత వార్త


వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతూ ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డీవోకి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల సంక్షేమం, అభ్యున్నతికి అవసరమైన పలు కీలక అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించడం, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ పథకాన్ని అమలు చేయడం, ఆంధ్రప్రదేశ్ మాసపత్రికను పునరుద్ధరించడం, సమాచార శాఖను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టుల భద్రత కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్‌కు తగిన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, రాష్ట్రస్థాయి జర్నలిస్టుల అవార్డులను పునరుద్ధరించడంతో పాటు కార్మిక బీమా, వృద్ధాప్య జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ఈ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆర్డీవో ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే ఎఫ్ అధ్యక్షుడు డి. మస్తాన్ (ఎన్‌టీవీ), గౌరవ అధ్యక్షుడు సోమశేఖర్ (ప్రజాశక్తి), ఉపాధ్యక్షుడు జర్నలిస్టులు జందు సతీష్, అస్లాం సాహెబ్ షఫీ, రాంకోటి, రాజేష్, మనంబండి సుధా, కోదండరాముడు, శ్రీనివాసులు, బి. రంగస్వామి, డి. రవితో పాటు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికి తెలుగుదేశం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న టిడిపి నాయకులు

చిలమత్తూరు, జూలై 31 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల్లో అందించిన సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాల అమల గురించి ప్రజలకు తెలియచేసేందుకు శుక్రవారం మండలంలోని మొరసలపల్లి, దేమకేతేపల్లి గ్రామాలతో పాటు చిలమత్తూరు పంచాయతీలోని 216, 217, 240, 241, 2 బూత్‌ల పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందచేస్తూ పథకాల గురించి వివరించారు. ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం, రైతులకు రైతు భరోసా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, పెన్షన్ల పెంపు, తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ పరిశీలకులు నరసింహయాదవ్, పొలిటికల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ శ్రీనివాస్, నాగరాజుయాదవ్, అంజినప్ప, సింగిల్ విండో అధ్యక్షులు బయపరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నందిశప్ప, గౌరీశంకర్, లక్ష్మీనారాయణ, అశ్వర్థప్ప, శ్రీరామ్‌రెడ్డి, వేమనారాయణ, మురళి, యూనిట్ ఇన్‌చార్జులు వేణు, మూర్తి, మంజునాథ్, బూత్ కన్వీనర్లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున, గోపి, నాగరాజు, రాజశేఖర్, చంద్రారెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షులు గౌస్‌బాషా, క్రిష్టప్ప, కుమార్, గంగాధర్, నారాయణస్వామి, శివప్ప, లక్ష్మీనారాయణ, లక్ష్మీపతిరెడ్డి, శ్రీరామ, నరసప్ప, రమేష్, కదిరప్ప, అంజి, నరసింహమూర్తి, ఆదిమూర్తి, రామచంద్ర, నాగరాజు, పూజారి మూర్తి, ముస్తఫా, సోహైల్, బాలరాజు, ఆంజనేయులు, బాలాజీ, శ్రీనివాస్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆషాడ మాస జ్యోతుల మహోత్సవం


గ్రామ దేవత ఊరు మారెమ్మకు జ్యోతులు మోస్తున్న మహిళలు

మడకశిర టౌన్ జూలై 31 ప్రభాతవార్త

మడకశిర పట్టణంలో శుక్రవారం 20 వార్డులలో ఉన్నటువంటి అన్ని కులస్థుల ఆధ్వర్యంలో జ్యోతుల మహోత్సవం సంబరంగా సాగింది. సంసంవత్సరం ఒక్కసారి ఆషాడ మాసంలో మూడవ వారంలో జ్యోతులు నిర్వహించడం ఆనవాయితీ జరపాలని అన్ని కులాల పెద్దలు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఊరు మారెమ్మ కొల్లాపూరమ్మ, సప్లమ్మ, ఒడిసెలమ్మ, గ్రామ దేవతల ఆలయాల్లో అమ్మవారికి పట్టణంలో ఉన్నటువంటి అన్ని కులాలకు సంబంధించినటువంటి మహిళలందరూ కలిసి జ్యోతులు మోస్తూ అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ: గ్రామదేవతలకు జ్యోతులు సమర్పిస్తే రైతులు పంట పండించే వర్షం రావాలని, ప్రజలందరూ అష్టైశ్వర్యాలు ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరుకుంటూ అన్ని కులాల మాత పెద్దలతో కలిసి జ్యో తుల ఉత్సవాలను జరిపించామన్నారు . వర్షం రావాలని ఆకాంక్షిస్తూ గ్రామదేవతలు అందరికీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, జ్యోతులను, సమర్పించారు. తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పట్టణమంతా గ్రామ దేవతల నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో అన్ని కుల సంఘాల పెద్దలు, మహిళలు యువత, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

పావగడ, జులై 31 ప్రభాతవార్త


మృతి చెందిన రైతు అంజనప్ప

తాలూకా అరసికెరె పోలీస్ స్టేషన్ పరిధిలోని హుట్టే బొమ్మనహళ్లి గ్రామానికి చెందిన రైతు అంజనప్ప (70) అప్పుల బాధతో గురువారం సాయంత్రం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. మృతుని బంధువులు ఇచ్చిన వివరాల మేరకు హుట్టెబొమ్మనహళ్ళి కి చెందిన రైతు అంజనప్ప తనకున్న మూడు ఎకరాల 31 కుంట్ల భూమి లో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించే వాడని కొడిగేహళ్ళి విఎస్ఎస్ఎన్ సొసైటీలో 50వేల రూపాయలు అప్పు చేశాడని పంటలు పండక కుటుంబ పోషణ భారమై అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది పూల తోటకు కొట్టడానికి తెచ్చిన మందును గురువారం సాయంత్రం సేవించాడని చికిత్స కోసం లింగదల్లి ఆసుపత్రికి తరలించామని మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలిస్తుండగా శుక్రవారం వేకుజామున మృతి చెందినట్లు తెలిపారు శవాన్ని పోస్టుమార్టంకు పావగడ ప్రభుత్వాసుపత్రికి తరలించి మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు మృతునికి భార్య, కొడుకు, కోడలు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

## వాల్మీకి జాగృతి వేదిక ఆధ్వర్యంలో ధర్నా


తహాశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పావగడ, జులై 31 ప్రభాతవార్త

పావగడ తాలూకాలోని పళవళ్ళి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వసతిశాల విద్యార్థులకు మూలభూత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వాల్మీకి జాగృతి వేదిక ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వాల్మీకి మహాసభ యువఘటక జిల్లా అధ్యక్షుడు పాలేగార్ లోకేష్ మాట్లాడుతూ.. పళవళ్ళి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వసతిశాలలోని విద్యార్థులకు మూలభూత సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని కల్పించడంలో అధికారులు విఫలమైనారని ధ్వజమెత్తారు. వెంటనే విద్యార్థులకు మూలభూత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను కొట్టి భయపెడతారని మంగళవారం ముగ్గురు విద్యార్థులు తప్పించుకొని వెళ్లారని తల్లిదండ్రులు పోలీసుల సహకారంతో వెతికి బెంగళూరు దగ్గర దొరకడంతో పిలుచుకుని రావడం జరిగిందన్నారు. ఇది మొదటిసారి కాదని పదేపదే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పాఠశాలలో పెర్మనెంట్ వార్డెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. మూలభూత సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రేడ్-2 తహాశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరనాయక, బేకరీ నాగరాజు, కన్నమేడి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప, టైలర్ నారాయణప్ప, కరవే లక్ష్మీనారాయణ, ఆటో సత్తి, బ్యాడనూరు శివ, తాలూకా రైతు సంఘం అధ్యక్షులు శివ తదితరులు ఉన్నారు.

## విద్యా ప్రాముఖ్యతకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గుత్తి, జూలై 31 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రాధాన్యతను గుర్తించి విద్యార్థుల సౌకర్యార్థం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్, తదితరులు స్పష్టం చేశారు. గుత్తి పట్టణంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థినిల సౌకర్యార్థం ఏడబ్ల్యుపి నిధుల కింద 1.60 కోట్ల రూపాయలు అంచనాతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతులను శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ విద్యార్థుల కోసం తల్లికి వందనం అమలు చేస్తూనే విదేశీ విద్యకు కోట్ల రూపాయలు నిధులను విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం కేటాయిస్తోందని పేర్కొన్నారు. విద్య తరగని ఆస్తి అంటూ వారు విద్యార్థులకు హితబోధ చేశారు. కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు కళాశాలకు ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని, ప్రస్తుతం ఉన్న ప్రహరీ గోడ ఎత్తును పెంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో వారు ముచ్చటించారు. భోజన సౌకర్యం గురించి ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగపరచుకొని విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు వృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాలలో ఉన్న చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రుద్రాక్షి, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, తహశీల్దార్ పుణ్యవతి, సంబంధిత అధికారులు, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 2,03,306కు తగ్గిన ఓటర్ల సంఖ్య..!

- 'సర్' కార్యక్రమంలో ఏఎస్‌డీడీ కింద 22,881 ఓట్లు తొలగింపు

- ఈఆర్‌వో, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్మోహన్

ఉరవకొండ, జూలై 31 ప్రభాతవార్త


ఎం.రాంమోహన్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026 కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే అనంతరం ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,03,306 గా ఉందని ఇందులో పురుషులు 1,00,480 మంది, మహిళలు 1,02,801 మంది, థర్డ్ జండర్ ఓటర్లు 25 మంది ఉన్నారని ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. సర్‌కు ముందు నియోజకవర్గంలో 2,26,187 మంది ఉండగా ఏఎస్‌డీడీ కింద 22,881 ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. ఇందులో ఆచూకీ తెలియని ఓటర్లు 2,799 మంది, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు 5,931 మంది, మణించిన ఓటర్లు 8,754 మంది, రెండు ఓట్లు కలిగిన ఓటర్లు 5,385 మంది, ఇతరులు 12 మంది ఉన్నారన్నారు. ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉంటే క్లైములు, అభ్యంతరాలను ఆగస్టు 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటర్లు ఎవరైనా ఓటరు జాబితాను చూసుకోవాలని అనుకుంటే ఆన్‌లైన్ లేదా కలెక్టరేట్, ఈఆర్‌వో, ఏఈఆర్‌వో కార్యాలయాలతోపాటు బీఎల్‌వోవద్ద పనివేళల్లో చూసుకోవచ్చని ఈఆర్‌వో ఎం.రామ్మోహన్ వివరించారు.

## 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్' పోటీల్లో విద్యార్థులకు ప్రథమ బహుమతి

- విద్యార్థులను అభినందించిన కళాశాల ప్రిన్సిపాల్ డా॥టి.శైలజా రాణి


ప్రథమ బహుమతిని అందుకొంటున్న విద్యార్థులు

ఉరవకొండ, జూలై 31 ప్రభాతవార్త

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్ నిర్వహించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' జిల్లాస్థాయి రీల్/షార్ట్ వీడియో పోటీల్లో ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం 5వ సెమిస్టర్ (కంప్యూటర్ అప్లికేషన్స్) చదువుతున్న విద్యార్థులు మధు, నవీన్, సుంకన్న, పరుశురామ్, పెద్దన్న ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డా॥టి.శైలజారాణి తెలిపారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన "మాదక ద్రవ్యాల వ్యసనం-కుటుంబపై చూపే దుష్ప్రభావాలు" అనే సామాజిక అంశాన్ని విద్యార్థులు హృదయాలను కదిలించేలా రీల్ రూపొందించి అద్భుతంగా ప్రదర్శించి న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకొని జిల్లా ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారన్నారు. ఈ అవగాహన రీల్‌కు కళాశాల కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మానిసేని సుధాకర్ కథ, స్క్రీన్‌ప్లే, ధర్శకత్వం వహించారన్నారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ సందేశాత్మక రీల్ సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తూ విశేష ఆదరణ పొందిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా॥టి.శైలజారాణితోపాటు వైస్ ప్రిన్సిపాల్ డా॥టి.ఎన్.మస్తానప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం.విష్ణుప్రియ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘించిన టిప్పర్లకు జరిమానా

- రూరల్ సిఐ జనార్ధన్


వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ జనార్ధన్

లేపాక్షి, జూలై 31 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే ధ్యేయంగా జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు లేపాక్షి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టినట్లు రూరల్ సిఐ జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా పలు టిప్పర్లు బాడీ కవర్లు లేకుండా, నిర్దేశిత వేగ పరిమితికి మించి అతివేగంతో వెళ్తున్నట్లు గుర్తించామన్నారు. టిప్పర్ల పైభాగంలో కవర్లు కప్పకపోవడం వల్ల లోడు రోడ్డుపై పడి, వెనుక వచ్చే వాహనదారులకు తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగా నిబంధనలు పాటించని, చట్టాన్ని అతిక్రమించిన ప్రతి టిప్పర్‌కు మోటారు వాహనాల చట్టం కింద 2,035 రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు సిఐ వెల్లడించారు. లారీ మరియు టిప్పర్ యజమానులు తప్పనిసరిగా బాడీ కవర్లు వాడాలని, వేగ పరిమితి దాటకుండా సురక్షితంగా వాహనాలు నడపాలని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని, భవిష్యత్తులో కూడా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సిఐ హెచ్చరించారు.

## టిడిపి లోకి చేరిన వైసిపి నాయకులు


టిడిపి లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి (వైద్యం) జులై 31 ప్రభాతవార్త

పుట్టపర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామం నుండి పది కుటుంబాలు వైసీపీను వీడి టిడిపి లో చేరారు. శుక్రవారం పుట్టపర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో పల్లె రఘునాథ్ రెడ్డి ఆ గ్రామానికి చెందిన ఆంజనేయులు, గోగుల అంజన్నప్ప, పావని గంగులమ్మ వారి కుటుంబ సభ్యులు తోపాటు మరో ఎనిమిది కుటుంబాలు టిడిపిలో చేరాయి మాజీ మంత్రి టిడిపి కండువాతో వారిని పార్టీలకు ఆహ్వానించారు, కష్టపడి పని చేసే వారికి వైసీపీలో ప్రాధాన్యత లేదని టిడిపిలో అభివృద్ధిని చూసి ఆ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ వీరనారాయణ, సూర్యనారాయణ, రాము, నారాయణ, నాగరాజు, దయ్యాల ఉమాపతి, చిమిరాల సుధాకర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

03ATP27_03ATP27.qxd 31-07-2026 PM 10:57 Page 1



## ఘనంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.భార్గవి పదవీ విరమణ

### - శుభాకాంక్షలు తెలిపిన గాండ్ల కులస్తులు



వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.భార్గవి పదవీ విరమణ సందర్భంగా సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం, జులై 31 ప్రభాతవార్త బ్యూరో**

వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్, అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ గాండ్ల కె.భార్గవి పదవీ విరమణ సందర్భంగా గాండ్ల సామాజిక వర్గీయులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. శుక్రవారం మధ్యాహ్నం బుక్కరాయ సముద్రం మండలం రెడ్డిపల్లిలోని వ్యవసాయ పరిశోధన క్షేత్రం అధికారుల ఆధ్వర్యంలో డాక్టర్ కే.భార్గవి పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పదవీ విరమణ పొందిన డాక్టర్ కే భార్గవి, ఆమె భర్త రెడ్డయ్య దంపతుల శేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడవాలని ఆకాంక్షిస్తూ పూలమాలలు, బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం (ఏజిటియుపిఎస్ఎస్), సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం (ఎస్‌జిటిపిఎస్ఎస్) రాష్ట్ర మీడియా సెక్రెటరీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేపీ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదని, ఆ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు మూలా ధారమని, అలాంటి రంగంలో పరిశోధనలు చేసి రైతులకు ఉపయోగపడే విజ్ఞానాన్ని అందించడం గొప్ప సేవ అని, అంతటి ఉత్కృష్టమైన సేవలో డాక్టర్ కే భార్గవి చేసిన సేవలు, పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. ఉద్యోగానికి పదవీ విరమణ ఉంటుంది కానీ, సేవకు ఉండదని, ప్రభుత్వ సేవలనుంచి విరమిస్తున్న ఆమె సమాజానికి, రైతులకు, వ్యవసాయ విద్యార్థులకు అందించే మార్గదర్శకత్వం మాత్రం కొనసాగుతుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. డాక్టర్ కే భార్గవి తమ ఉద్యోగ జీవితమంతా రైతు సంక్షేమానికి, వ్యవసాయ పరిశోధనకు, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసి, ఒక మంచి శాస్త్రవేత్తగా, సమర్థ పరిపాలకురాలిగా, విద్యార్థులకు ఆదర్శ గురువుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏజిటియుపిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాండ్ల నరసింహుడు, కార్యవర్గ సభ్యుడు రణ కుమార్, సభ్యుడు మద్దిలేటి, సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మాజీ గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, రాష్ట్ర నాయకులు ముకుందాపురం గంగాధర్, విద్యా కమిటీ కన్వీనర్ లెక్చరర్ రవికుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, పసల శ్రీనివాసులు, విజయ మద్దిలేటి, సన్మాన గ్రహీత కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు

### - డిమాండ్స్ డే సందర్భంగా జాయింట్ కలెక్టర్ ప్రభుత్వానికి ఎపిడబ్ల్యూజెఎఫ్ వినతి పత్రం



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జులై 31 ప్రభాతవార్త**

ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎపిడబ్ల్యూజెనీ నాయకులు అన్నారు. డిమాండ్స్ డే సందర్భంగా APWJF నాయకులు జర్నలిస్టుల సమస్యలపై అనంతపురం జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలోని పలువురు జర్నలిస్టులతో కలిసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫీ, రేపటి రామాంజినేయులు ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. జర్నలిస్టుల సమస్యలను అలాగే గతంలో ఇచ్చిన హామీల గురించి వివరించారు. వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు షఫీ, రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మేము విన్నవించడం తప్ప సమస్యలు ఎక్కడా పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికే చాలా ప్రభుత్వాలు మారాయని ఎంత మంది అధికారులు మారారని కానీ మా సమస్యల పట్ల ఉదాసీన వైఖరి కొనసాగు తోందన్నారు. ఇప్పటికైనా ఆ హామీలు నెరవేర్చకపోతే.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సూర్య, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కేశవ్ ఉపేంద్ర రాజారెడ్డి అనిల్ పవన్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రావ్యాలకు దూరంగా ఉండాలి

### - మై భారత్ ఆధ్వర్యంలో ఘనంగా నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం



అవగాహన కార్యక్రమంలోని ఓ దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జులై 31 ప్రభాతవార్త**

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్, అనంతపురం నిర్వహణలో నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో " నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" జిల్లా స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జి.మమతా, జిల్లా యువజన అధికారి ఐశయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు డి.భరత్, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సరిత, నిగమా ఫౌండేషన్ కోఫౌండర్ వసుంధర, మై భారత్ కోఆర్డినేటర్ బిసాతి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, కె.జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.భార్గవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, మాదకద్రావ్యాల వినియోగం యువత ఆరోగ్యం, కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రతి యువకుడు మాదక ద్రావ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే "నషా ముక్త్ భారత్ - వికసిత్‌భారత్" లక్ష్యసాధనలో భాగంగా ప్రజల్లో మాదకద్రావ్యాల నిర్మూలన పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులు విష్ణుప్రియ, వీరేంద్ర, నాగభూషణ్, నాగశుభ, ప్రగతి పదం యూత్ అసోసియేషన్ సభ్యులు సాయి కార్తిక్, అంబరీష్, రాము, అలాగే మైభారత్ వాలంటీర్లు, యువజనసంఘాల ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, పెద్దసంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

### ఐసిడిఎస్ సూపర్వైజర్లు

**అనంతపురం రూరల్, జులై 31 ప్రభాతవార్త :**

అనంతపురం రూరల్ మండల గ్రామాలలోనేటి నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతల్లి పాలు శిశువుకు సంపూర్ణ ఆహారం. పుట్టిన వెంటనే మొదటి గంటలోపు తల్లిపాలు పట్టించడం, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం సరైన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించడం ప్రతి శిశువు ఆరోగ్యానికి అత్యంత అవసరమని, ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సహకరించాలని కోరుతున్నామని ఐ సీ డి ఎస్ సూపర్వైజర్లు తెలియజేశారు.

## సిండికేట్ నగర్ లో ఇంటికి టిడిపి కార్యక్రమం నిర్వహణ

### అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయ

### ఈ కార్యక్రమంలో కనిపించని స్టోర్ డీలర్లు, సీనియర్ నాయకులు

**అనంతపురం రూరల్ జులై 31 ప్రభాతవార్త :**



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం.

మని అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం మండలం లోని రాచా నపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ఇంటింటా ప్రచారం చేపట్టి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అదేవిధంగా ప్రజలకు ఏమేం పథకాల అందాయో తెలుసుకొని వాటి గురించి వివరించారు. యాదవ సాధికార సమితి అధ్యక్షులు బిల్లా నాగరాజు, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పూత్తా ఎర్రి స్వామి, టిడిపి నాయకులు కురుబ వీరేష్, కురువ వెంకట్ రాముడు, కుమ్మర కిష్ట, దేవరకొండ మహేష్, ఏకుల అంజి ల తో కలసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ ఇంటింటి కార్యక్రమంలో కనిపించని స్టోర్ డీలర్లు, సీనియర్ నాయకులు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాచానపల్లిలో ఇంటికి టిడిపి కార్యక్రమం నిర్వహణ



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్ జులై 31 ప్రభాతవార్త :**

మని అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం మండలం లోని రాచా నపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ఇంటింటా ప్రచారం చేపట్టి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అదేవిధంగా ప్రజలకు ఏమేం పథకాల అందాయో తెలుసుకొని వాటి గురించి వివరించారు. మండలంకన్వీనర్, జింకసూర్యనారాయణ, ఎంపీటీసీ కృష్ణారెడ్డి,సింగిల్ విండో అధ్యక్షుడు పాములాయి రఘు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుల్లెట్ రఫీ, మండల ప్రధాన కార్యదర్శి దుర్గం రవీంద్ర, స్టోర్ డీలర్ పసల ఆదినారాయణ, సీనియర్ నాయకుడు అ క్కులప్ప (బోజ్జయ్య) టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, నాగరాజు, రాజేష్, హుస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ కుమార్ రెడ్డిలతో కలసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు విద్యాచక్రం కానుకగా సైకిళ్లు పంపిణీ

**మొదటిపేజీ తరువాయి...** తప్పకుండా మంజూరు చేస్తాను, మొదటి ప్రాధాన్యత మీ నియోజకవర్గానికే ఇస్తానని చెప్పాదని తప్పకుండా త్వరలోనే చాలా వరకు రోడ్లు మంజూరవుతాయని ఈ గ్రామంలో కూడా సీసీ రహదారులు నిర్మించి మౌళిక వసతులు కల్పించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, మండల గ్రామ స్థాయి నాయకులతో కలసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య పాలన, కనీసం గ్రామాల్లో సరైన మౌళిక వసతుల కల్పనపై కూడా దృష్టి పెట్టకుండా సమస్యలను పెంచి వెళ్లారని ఇప్పుడు వాటిని అదిగమించి గ్రామీణ రహదారులతో పాటు గ్రామాల్లో మౌళిక వసతులైన విద్యుత్, తాగునీరు, సీసీ రహదారులు నిర్మించి ప్రజల సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, స్థానిక నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పడకేసిన వ్యవస్థ..పట్టని అవస్థ..!



కొండకింద వీధిలో తాగునీటి పైపులను చుట్టేసిన మురుగు

**మొదటిపేజీ తరువాయి...** కాదు, వారాలు కాదు నెలల తరబడి ముక్కుపుటాలు అదిరేలా వస్తున్న దుర్వాసన మధ్య ఎలా జీవనం చేయాలని పంచాయతీ అధికారుల తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక అరగంట సేపు అధికారులను సినిమా థియేటర్ వెనుక వీధి, పక్కవీధు ల్లో తిరిగితే మేము అనుభవించే ప్రత్యక్ష నరకం వారికి తెలుస్తుందని స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా స్వచ్ఛత పాటించాలని, విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే అధికారులు క్షేత్రస్థాయిలో ఏ మేరకు అపరిశుభ్రతను తొలగిస్తున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని జనం సూచిస్తున్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

**మొదటిపేజీ తరువాయి...** 46,452 , ఉన్నారన్నారు. ఎవరికైనా ఏవైనా అభ్యంతరములు ఉన్నయెడల, క్లైములు , అభ్యంతరాలు ఉన్నవారు జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు సుజాత, హరిప్రసాద్, కేశవరెడ్డి, నాగేంద్రప్రసాద్, హబీబాఖానం, నాగమణి, సువర్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పంటల బీమా చెల్లింపుకు శుక్రవారం ఆఖరుతో

## ఆన్లైన్ సెంటర్ల వద్ద రైతులు పడిగాపులు

### సర్వర్లు పనిచేయక రైతుల సతమతం. ఫార్మర్ ఐడీ అందక ఆందోళనలో రైతులు. గడువు పెంచాలని కోరుతున్న రైతులు.

**అనంతపురం రూరల్, జులై 31 ప్రభాతవార్త :**



ఆన్లైన్ సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు.

ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా దాదాపు వేల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. అంతే కాకుండా రబీ సీజన్లోనూ చాలా మంది రైతులు టమాట, మామిడి, అరటి, దానిమ్మ పంటలను సాగు చేశారు. ఈ పంటలకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవా రంతో బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగియనుండగారైతు లంతతా శుక్రవారం చివరి రోజు కావడంతో మండలంలోని వివిధ గ్రామాల రైతులు నగరానికి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా సర్వర్ సతాయింపుతో ప్రీమియం చెల్లించలేకపో యారు. దీంతో చాలా మంది వ్యయప్రయాసల నుంచి అనంతపురం వరకూ వెళ్లి ప్రీమియం చెల్లించారు. కానీ చాలా మంది ప్రీమియం చెల్లించలే కపోయారని, అందువల్ల ప్రీమియం గడువు పెం చాలని రైతులు కోరుతున్నారు.

**ఫార్మర్ ఐడీతో ఇబ్బందులు :** బీమా ప్రీమియం చెల్లించాలంటే ఫార్మర్ ఐడీ తప్ప నిసరిగా ఉండాలి. దీంతో రైతులు ఫార్మర్ ఐడీ కోసం రైతు సేవా కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే కొత్త పాస్పుస్తకాలున్న రైతుల ఫార్మర్ ఐడీలు నేరుగా తహసీల్దార్ కార్యాలయం లాగిన్కు వెళ్తున్నాయి. దీంతో అక్కడ తహసీల్దార్ వేలిముద్ర వేసి ఓటీపీ చెబితేనే ఫార్మర్ ఐడీ క్రియేట్ అవుతుంది. అయితే రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చాలా మంది ఇప్పటిదాకా ఫార్మర్ ఐడీ పొందలేకపో యారు. ఈ నేపథ్యంలోనే రైతులు, రైతు సంఘాల నాయకులు బీమా ప్రీమియం చెల్లింపు గడువు పెం చాలని కోరుతున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో జనాభా ప్రాతిపదికంగా కురబలకు సీట్లు కేటాయించాలి

### కురవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, రూరల్ మండల అధ్యక్షులు బండి ఈశ్వరయ్య.



సమావేశంలో మాట్లాడుతున్న బోరంపల్లి ఆంజనేయులు.

**అనంతపురం రూరల్, జులై 31 ప్రభాతవార్త :**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కుల ప్రతిపదకంగా కురవలకు సీట్లు కేటాయించాలని కురవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు, రూరల్ మండల అధ్యక్షులు బండి ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం కురబ కురవ కురమ రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కి ఒక ఎమ్మెల్యే మంత్రి, ఇద్దరు ఎంపీలకు, అవకాశం కల్పించినందుకు మా కుల సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మాకురవ కులస్తులకి ఒక టీటీడీబోర్డు మెంబర్, ఒక ఎమ్మెల్సీ ,గొర్రె కాపులకు ఇన్సూరెన్స్, గూడికట్లు పూజారులకు, గురువాయులకు కనీస గౌరవ వేతనం, ఇస్తారని కుప్పం కురవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో హామీ ఇవ్వడం జరిగిందని ఆ హామీలను త్వరలోనే నెరవేర్చాలని ఈసభాముఖంగా తెలియజేస్తున్నామని .రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుబల జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని టీడీపీ వైఎస్సార్సీపీ, బీజేపీ,కాంగ్రెస్, జనసేన, సిపిఐ సిపిఎం,అన్ని పార్టీ అధ్యక్షులకు పత్రికాముఖంగా,సంఘం ఆధ్వర్యంలో కలిసి మనవిచేసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు రాష్ట్ర ఉపాధ్యక్షులు బిల్లే నరేంద్ర , రాష్ట్ర కార్యదర్శి పూలంపల్లి అశ్వర్థ ,రాప్తాదునియోజకవర్గం అధ్యక్షులువెంకటాపురం గిరిక మురళి, సిండికేట్ నగర్ రూరల్ మండలం అధ్యక్షుడు బండి ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి బాల గంగాధర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెనకలపాడు పాటిల్ మల్లికార్జున, జిల్లా మహిళ అధ్యక్షురాలు మాజీ ఎంపీపీ మాధవి ,జిల్లా ఉపాధ్యక్షులు వేపచెర్లఅంజి,ఆకుతోటపల్లి రామకృష్ణ, కనకదాస్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు చిట్రా అభి, బ్యాళ్ల ఎర్రస్వామి, బ్యాల్ల వీర నందా, కమతం లక్ష్మీనారాయణ, బొంతుల రామచంద్ర, బొంతుల కిరణ్, బొంతుల ప్రవీణ్, బొంతుల రాజు,బొంతులశ్రీనివాసులు, బొంతుల మధుసూదన్, కురవ సంఘం తదితర నాయకుల పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల

### - అభ్యంతరాలు ఉంటే ఈ నెల ఆఖరు వరకు దరఖాస్తు చేసుకోండి

### - స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్ఓ కిరణ్మయి



ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి

**శింగనమల, జూలై 31 ప్రభాతవార్త**

కేంద్రఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) -2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించినట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, శింగనమల ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ కిరణ్మయి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ శింగనమల-152 ఎస్‌ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,22,458 అందులో పురుషులు 1,10,485 (49.66 శాతం), స్త్రీలు 1,11,945(50.32 శాతం) మంది థర్డ్ జెండర్ 28 (0.01శాతం) ఓటర్లు కలరు. 27,898 మంది ఓటర్లను ఏఎస్‌డిడి కింద తొలగించినట్లు వాటిలో ఆచూకీ తెలియని ఓటర్లు 3.368 (1.51శాతం) శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు 9,062 (4.07 శాతం), మరణించిన ఓటర్లు 10,473 (4.70శాతం), రెండు ఓట్లు కలిగిన ఓటర్లు 4,971(2.23శాతం), ఇతరులు 20 (0.00) ఇందులో ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉంటే క్లైమ్‌లు, అభ్యంతరాలు 31-07-2026 శుక్రవారం నుంచి 30-08-2026వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని, ఓటర్లు ఎవరైనా ఓటరు జాబితా చూసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్ ద్వారా కాని కలెక్టర్ కార్యాలయం, ఈఆర్ఓ కార్యాలయం, ఏఈఆర్ఓ కార్యాలయం, సంబంధిత బిఎల్‌ఓల వద్ద పనివేళల్లో ఉదయం 10 : 30 నుంచి సాయంత్రం 5:00లోపు చూసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ఖానుం పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలిసిన తనకండి మధుసూదన్

**అమడగూరు, జూలై 31 ప్రభాతవార్త**



ఆమడగూరు మండలం జేకే పల్లి గ్రామ యూనిట్ కన్వీనర్ తనకండి మధుసూదన్ శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ యూనిట్ ఉత్తమ కార్యకర్తగా పనిచేసినందుకు తనకండి మధుసూదన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో తనకండి మధుసూదన్

## ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేయండి

### - మాజీ మంత్రి సాకే శైలజానాథ్



మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌తో వైసిపి నేతలు

**శింగనమల, జూలై 31 ప్రభాతవార్త**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసే కార్యకర్తలకు అధిష్టానం తగిన గుర్తింపునిచ్చిందని, ఇటీవల నూతనంగా పార్టీలో పదవులు పొందిన నాయకులను సన్మానిస్తూ మాజీ మంత్రి నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇటీవల వైఎస్ఆర్‌సిపి జిల్లా, మండల స్థాయి పార్టీ పదవులు పొందిన నాయకులను మాజీ మంత్రి నియోజకవర్గ సమన్వయ కర్త డా.సాకేశైలజానాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం పలు పార్టీల నాయకులు, కార్యకర్త ల సమక్షంలో నిర్వహించారు. అనంతరం సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. నూతనంగా పార్టీలో పదవులు పొందిన వారు పార్టీ సిద్ధాంతాల ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో వైఎస్ఆర్‌సిపి బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన యం.రామకృష్ణనాయక్, జిల్లా నాయకులు శీన, జగన్‌మోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు వెంకటరాముడుతోపాటు పలువురుని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు, మండల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జెఎన్‌టియుఏ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా దుర్గా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

**అనంతపురం సిటీ, జూలై 31 ప్రభాతవార్త**



జెఎన్‌టియుఏ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గా ప్రసాద్

జెఎన్‌టియుఏ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా దుర్గా ప్రసాద్ శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. జెఎన్‌టియుఏ రిజిస్ట్రార్ కృష్ణయ్య తన బాధ్యతల నుంచి వైదొలిగారు. దీంతో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్న దుర్గా ప్రసాద్‌ను ఇన్‌చార్ జ రిజిస్ట్రార్‌గా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు నియమించారు. విసి సుదర్శన్‌రావు ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా దుర్గా ప్రసాద్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించిన విసి సుదర్శన్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, జెఎన్‌టియుఏ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్లు, బోధన బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ దుర్గా ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సత్కరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

### అరవకూరు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు గంగేలి కృష్ణ



మృతుడు గంగేలి కృష్ణ (ఫైల్‌ఫోటో)

**ఉరవకొండ, జూలై 31 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గం లోని కూడేరు మండలం అరవకూరు గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల గ్రామానికి చెందిన కురుబ గంగేలి కృష్ణ (21) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. బేల్దారి వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్న కృష్ణ తన ద్విచక్ర వాహనంలో అనంతపురం నుండి స్వగ్రామానికి వెళ్తుండగా ఆరవకూరు గ్రామం వద్ద లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న కూడేరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దీర్ఘ కాలిక సమస్యలకు చెక్..

**మొదటిపేజీ తరువాయి...** నిర్ణయం తీసుకోవాలని హెచ్చరించారు. లేకపోతే తానుచూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు బస్సు యజమానులు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా బస్సులు నడుపుతున్నారని ఆరోపించిన జె.సి అలాంటి వారిపై తన వద్ద పూర్తి వివరాలు ఉన్నాయని హెచ్చరించారు. ఉచిత బస్సు పథకం అమలులో ఉన్న సమయంలో కూడా తాను చట్టబద్ధంగా పన్నులు, ఇన్సూరెన్స్ చెల్లించి బస్సులను నిలిపివేశానని తెలిపారు. వోల్వో, మెర్సిడెస్ బెంజ్ బస్సుల నిర్వహణ ఖర్చులు ఎంత భారంగా ఉంటాయో వివరించిన ఆయన ఒక్కో వోల్వో బస్సు విలువ దాదాపు 2 కోట్లు ఉంటుందని చెప్పారు. టాటా బస్సులతో పోలిస్తే బెంజ్ బస్సుల మెయింటెనెన్స్‌కు భారీ ఖర్చు అవుతుందని, స్పేర్ పార్ట్స్ కొరతతో బస్సులు నిలిచిపోతే భారీ నష్టాలు వస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## డిఎస్సీ నియామకాలపై సిబిఐ విచారణ జరిపించాలి

**మొదటిపేజీ తరువాయి...** తలారి రంగయ్య, కేతిరెడ్డి పెద్దారెడ్డి, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, నైరుతి రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం అనేది నిరుద్యోగ యువతకు కల అన్నారు. ఆ కలను డిఎస్సీలో అక్రమాలకు పాల్పడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్‌లు విచ్ఛిన్నం చేశారని విమర్శించారు. మెగా డిఎస్సీ పేరుతో దగా చేసి నిరుద్యోగ యువతను వంచించారని మండి పడ్డారు. పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో ప్రతి స్కీంలోనూ స్కాం ఉంటుందని, అందుకు నిదర్శనం డిఎస్సీ నియామకాలు అని అన్నారు. సమన్వయ కర్తలు తలారి రంగయ్య, శైలజానాథ్, విశ్వేశ్వర్‌రెడ్డి, పెద్దారెడ్డిలు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు పెద్ద పీట వేస్తామని, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని అధికారంలోకి రాగానే యువతను వంచించారని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

**CHANGE OF SURNAME**
I, SYED SHABANA (Old Name) W/o SYED ISMAIL, residing at 1-3-708A, Ramalayam Street, Anantapur Dist (AP) 515001, Hereby declare that I have changed my surname as **KOLIMI SHABANA** (new name)

04ATP13_04ATP13.qxd 31-07-2026 PM 10:16 Page 1



# అభివృద్ధికి వైసీపీ అడుగడుగునా ఆటంకమే

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె

**పుట్టపర్తి టౌన్, జూలై 31, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుంటే, వైసీపీ మాత్రం అభివృద్ధి కార్యక్రమాలకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తూ విధ్వంస రాజకీయాలకు పాల్పడుతోందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని గోనెనాయక్ తండా, బడే నాయక్ తండా ప్రాంతాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ కాలనీల్లో వీధి లైట్ల ఏర్పాటు, తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్య మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రతి గ్రామం, ప్రతి కాలనీకి మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల ఆశీస్సులతో పుట్టపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో కనీ విని ఎరుగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దేశానికే తలమానికమైన 5వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ లక్ష కోట్ల పెట్టుబడులతో పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి ఒకవైపు...ప్రజా సంక్షేమం మరోవైపు

**- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కార్మిక బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్**

**గుత్తి, జూలై 31 ప్రభాతవార్త**



అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా, ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలు, మరోవైపు ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్‌లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని 9వ బ్లాకులో విస్తృతంగా ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నమ్మకం అభివృద్ధి సంక్షేమం అన్న ప్రధాన అంశాలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, ఎంతమంది విద్యార్థులు ఉన్న ఆ కుటుంబానికి తల్లికి వందనం, రైతులకు రైతు భరోసా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు విదేశీ విద్య, పారిశ్రామిక అభివృద్ధి, పెన్షన్ల పెంపు, తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. అంతకమునుపు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని డాక్యుమెంట్ రైటర్లు కోరగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, పార్టీ కన్వీనర్లు ఎంకే చౌదరి, లక్ష్మీరంగయ్య, బద్రివలి, మారుతిప్రసాద్, బిజెపి కన్వీనర్ వెంకప్ప, టిడిపి నాయకులు. చికెన్ శీనా, సోమశేఖర్, సుధాకర్, పిల్లి కృష్ణయ్య, సుంకన్న, రంగారెడ్డి, బోయ వేణు, ఇలియాజ్, శ్రీనివాసులు, హెచ్ఎం రసూల్, హెచ్ఎం జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో హోటల్ నిర్వహణపై విచారణ

**- హోటల్ నిర్వహిస్తున్నది వాస్తవమేనని విచారణలో వెలుగులోకి**

**- హోటల్ నిర్వహిస్తున్న వర్కర్ తొలగింపు - రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో ఇదే చర్చ**

**వార్త ప్రభావం**



**అనంతపురం న్యూటౌన్, జూలై 31 ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్2 లో తరగతి గదుల మధ్యలో హోటల్ నిర్వహిస్తూ ఒక్క దోశ రూ.10 రూపాయలకు పేద విద్యార్థులకు విక్రయిస్తుండటంపై ఆధారాలతో సహా జూలై31న వార్తదినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున చర్చించుకున్నారు. అంతేకాకుండా ఈ కథనానికి రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్ కూడా స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు అనంతపురం ఎంఈఓ 2 సరిత రాణి ను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

**ఎంఈఓ 2 పై విద్యాశాఖ అధికారుల ఆగ్రహం :**

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈఓ 2 శుక్రవారం ఉదయం ఆ పాఠశాలకు వెళ్లి విచారణ చేసింది. కానీ తాన స్వయంగా విచారణ చేసిన నివేదికను తయారుచేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించాల్సి ఉంది. కానీ ఎంఈఓ 2 ఆ పాఠశాల హెచ్ఎం బి.నవీద తయారుచేసి ఇచ్చిన నివేదికను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేసింది. ఆ నివేదికను చూసిన విద్యాశాఖ అధికారులు ఎంఈఓ2 పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిమ్మల్ని విచారణ చేసి నివేదిక అందజేయమని చెబితే మీరు ఆ పాఠశాల హెచ్ఎం తయారుచేసి ఇచ్చిన నివేదికను ఫార్వర్డ్ చేస్తే ఎలా అని ప్రశ్నించారు. మీరు స్వయంగా విచారణ చేసిన నివేదికను అందజేయాలని ఆదేశించారు. దీంతో ఎంఈఓ 2 విచారణ అదే రోజు సాయంత్రం 6 గంటల సమయానికి విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేశారు. పాఠశాలలో ఉదయం దాదాపు రెండు గంటల పాటు విచారణ చేశారు. విచారణలో కూడా అక్కడ పనిచేస్తున్న వర్కర్లలో ఒకరు హోటల్ నిర్వహిస్తుండడం వాస్తవమేనని బయటపడింది. ఈ హోటల్ నిర్వహణ దాదాపు రెండేళ్లుగా కొనసాగుతుంది. హోటల్ నిర్వహిస్తున్న వర్కర్ ను తొలగించినట్లు హెచ్ఎం రాసిచ్చారు. కానీ చర్యలు నుంచి తప్పించుకోవడానికి హోటల్ నిర్వహణ విషయం తమకు తెలియదని, పెట్టొద్దని చెప్పినప్పటికీ వినలేదని హెచ్ఎం, టీచర్లు చెప్పడం, ఇదే విషయాన్ని విద్యార్థులతో కూడా చెప్పించినట్లు తెలిసింది. దీనిని బట్టి చూస్తే ఆ పాఠశాల హెచ్ఎం, టీచర్లు తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అయితే విచారణ నివేదికపై విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అన్నది టీచర్లలో ఉత్కంఠ నెలకొంది.

**హెచ్ఎం కు నోటీసు జారీ :**

ప్రభుత్వ పాఠశాలలో హోటల్ నిర్వహిస్తుండటంపై వార్త దినపత్రికలో కథనం రావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ 2 హెచ్ఎం నవీదకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి నోటీసు జారీ చేశారు. గడువు లోపు వివరణ రాసివ్వాలని నోటీసులో పేర్కొన్నారు. వివరణను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే గారూ..ఇచ్చిన హామీ నిలబెట్టుకోండి..!!

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్**




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్

**గుంతకల్లు, జూలై 31 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం బీటి పక్కీరప్ప భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుండి నియోజకవర్గంలోని చెరువులకు నీళ్లు నింపాలన్న డిమాండ్‌తో గత మార్చి నెలలో మున్సిపల్ కార్యాలయం ముందు రైతులతో సీపీఐ దీక్ష చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దీక్షను సందర్శించి మూడు నెలల్లో చెరువులకు, కుంటలకు కృష్ణా జలాలను తీసుకొస్తామని రైతులకు మాట ఇచ్చారని గుర్తు చేశారు. నాలుగు మాసాలు గడిచినా నీళ్లు తీసుకురాలేదన్నారు. దీంతో ఎల్‌నినో ప్రభావం వల్ల ఖరీఫ్ మొత్తం దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో 8 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే కేవలం 2 లక్షల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారన్నారు. ప్రభుత్వం స్పందించి రాయలసీమ రైతాంగానికి పంట రుణాలు మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాముురాయల్, ఏఐటియుసి మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**తలుపుల, జూలై 31, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పులిగిండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో రెండేళ్ల కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటికి తిరుగుతూ తెలియపరిచాడు. అనంతరం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన వినూతులను స్వీకరించి అప్పటికప్పుడు పరిష్కరించే సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కరించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.. గత ప్రభుత్వం ధనార్జన ధ్యేయంగా రహదారులపై కంకర వేసి బిల్లులు చేసుకుని వదిలేశారు. వాటిని మేము ఇప్పుడు తారు ధరలు పెరిగిన కాంట్రాక్టర్లను ఒప్పించి తారు రోడ్లను వేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పథకాలు నెరవేర్చమన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలకు న్యాయం అందించేందుకు వారి సమస్యలు పరిష్కరించేందుకు రూపొందించిన ముఖ్యమైన వేదికని తెలిపారు. నాయకులు కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శంకరి వీరప్రసాద్, మాజీ కన్వీనర్ ముబారక్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, భార్గవ్ రెడ్డి, జై చంద్ర, రాజారెడ్డి, రఘునాథ్ రెడ్డి, శ్రీశైలం రమణ తదితర నాయకులు కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

**- ఒకనెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ - ఉదిరిపికొండలో వరుసగా 3వ శుక్రవారం ప్రజలనుండి 76 అర్జీలు స్వీకరించిన కలెక్టర్**



ప్రజలతో సమస్యలు తెలుసుకొంటున్న కలెక్టర్ ఓ.ఆనంద్

**ఉరవకొండ, జూలై 31 ప్రభాతవార్త**

ప్రజల సమస్యలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలో వరుసగా 3వ శుక్రవారం "ఒకనెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు" కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని వివిధ సమస్యలపై గ్రామస్థుల నుండి 76 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అన్ని రకాల అర్జీలను 4వ వారంలోపు పూర్తిస్థాయిలో ఖచ్చితంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి సీ వ్వకరించిన అర్జీలను చట్ట ప్రకారం పరిష్కరించగలిగినవి పరిష్కరించాలని, పరిష్కరించలేనివి ఎందుకు పరిష్కరించలేము అనేది అర్జీదారులకు తెలియజేయాలన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. ఎక్కువగా భూమికి సంబంధించిన సమస్యలు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పట్టాలు, విద్యుత్ సమస్యలు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు తదితర శాఖల పరిధిలో వచ్చిన సమస్యలను నాణ్యతగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల మండల అధికారులను ఆదేశించారు. వచ్చే 4వ శుక్రవారం ఉదయం నిర్వహించే కార్యక్రమంలో అర్జీదారులను పిలిపించుకొని వారిచ్చిన అర్జీలను చదివి వినిపించాలని, పరిష్కరించగలిగినవి పరిష్కరించి, పరిష్కరించలేనివి ఎందుకు పరిష్కరించలేము అనేది వివరాలతో సహా వారికి వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ మోహన్‌కుమార్, ఆయా శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

# మేమేమి చేశాం నేరం.. మాకెక్కడంటింది పాపం..!



చట్టం దరఖాస్తుదారుల కోసం వేచిచూస్తున్న వీఆర్ఏలు

**యాడికి(తాడిపత్రి), జులై 31, ప్రభాతవార్త:**

యాడికిమండలంలోని కొందరువీఆర్ఏ(గ్రామనౌకరు)ల దుస్థితి తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా మారింది. ఇద్దరు, ముగ్గురు చేసిన తప్పిదాలకు అందరూ మూల్యం చెల్లించేలా పరిస్థితిని మార్చారంటూ అధికారులపై లోలోపల మండిపడుతున్నారు. విషయమేమిటంటే తాడిపత్రికి చెందిన కొందరు ఆర్టీఐ యాక్టివిస్టులు యాడికి మండలంలోని వీఆర్ఏల వేతనాలు, వారుపొందిన ఇంటిపట్టాలు, డి.పట్టాభూములకు సంబంధించిన వివరాలను సమచారహక్కుచట్టం కింద కోరారు. గతంలో వీఆర్ఏగా విధులు నిర్వహించి ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న ఒకరు, ప్రస్తుతం రెవెన్యూ అధికారులకు తలలో నాలుకలా వ్యవహరిస్తూ ఇతర వీఆర్ఏలకు ఆదర్శమని అధికారులతో మన్ననలుపొందుతున్న మరో వీఆర్ఏ, రెవెన్యూ అధికారులకు మింగుడుపడనివిధంగా మారిన ఇంకోవీఆర్ఏలు అక్రమంగా..అధిక మొత్తంలో భూములు పొందారని ఆనోట ఈనోట తెలుసుకున్న కొందరు ఆర్టీఐ ద్వారా సమాచారం కోరినట్లు తెలుస్తోంది. ఆర్టీఐ ద్వారా కోరిన సమాచారం ఇస్తే తామెక్కడ ఇరుక్కుంటామోనని భావించిన ఓ రెవెన్యూ అధికారి సమాచారం కోరిన వ్యక్తులతో రాజీ కుదుర్చుకోమని సలహా ఇవ్వడంతో ఇతర వీఆర్ఏలు సతమతమవుతున్నారు. తామేం నేరం చేయకపోయినా..అవినీతి పాపం అంటకపోయినా తామెందుకు వారి కోసం ఎదురుచూడాలని, వారితో రాజీ ఎందుకు కుదుర్చుకోవాలని వాపోతున్నారు. ఈ సహచట్టం చక్రం వెనుక మరో కోణం కూడా బయట పడినట్లు, దాన్ని ఆసరగా చేసుకొని తమను వేదించడం ఎంత వరకు సమంజసమని ఇతర గ్రామనౌకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తన సామాజిక వర్గానికి చెందిన ఓ యూట్యూబర్‌కు ఇక్కడి రెవెన్యూ అధికారి తనకు తలలో నాలుకలా వ్యవహరించే గ్రామనౌకరుతో కొంత మొత్తం ముట్టచెప్పినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయం కొందరికి తెలియడంతో ఆర్టీఐని అతని ఒకని మీద కాకుండా అందరి మీద ప్రయోగించినట్లు, వారికి వీరందరితో కొంత మొత్తం ముట్టచెప్పే ప్రయత్నంలో భాగంగా వీఆర్ఏలు అందరూ వారి రాకకోసం రోజంతా ఎదురుచూడటం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం మొత్తం బయటికి పొక్కడంతో సహ చట్టం దుర్వినియోగంపైనా, రెవెన్యూ అధికారుల తీరుపైనా సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఖరీఫ్ పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు పొడగించాలి

**- ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి**

**- ప్రభుత్వాన్ని కోరిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి**

**ఉరవకొండ, జూలై 31 ప్రభాతవార్త**

రైతులు ఖరీఫ్ పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం మరో 15 రోజులు గడువు పొడగించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రీమియం చెల్లింపు గడువు జూలై 31వ తేదీతో ముగిసినందున ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, ఆర్థిక సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా అనేక మంది రైతులు నిర్ణీత గడువులోగా బీమా ప్రీమియం చెల్లించలేకపోయారన్నారు. రాష్ట్రంలో సరిగ్గా వర్షాలు కురవని కారణంగా రైతులు ఆలస్యంగా విత్తనం వేసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్‌లో ప్రీమియం చెల్లించేందుకు జూలై 31 వరకు మాత్రమే గడువు పెట్టడంతో రైతులు తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. రైతుల కష్టాలను పరిగణిలోకి తీసుకొని ప్రభుత్వం గడువు పొడిగించాలని ఎమ్మెల్సీ కోరారు. జిల్లాలో ఇప్పటివరకు 1.90 లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లించలేదనా న్నరు. గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేస్తే కొన్ని పంటలకు ఏకంగా 18 లక్షల రూపాయల వరకు బీమా అందిందని తెలిపారు. జిల్లాలో కీలక పంట వేరుశెనగ సాగు దారుణంగా పడిపోయిందని 3.64 లక్షల ఎకరాల సాధారణ విస్తీర్ణానికిగాను కేవలం 45వేల ఎకరాల్లోనే పంట సాగైందన్నారు. ఖరీఫ్‌లో 75శాతం లోటు వర్షపాతం ఉందని చాలా మండలాల్లో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచి భుగర్భ జలాలను పెంపొందించి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని ఆలోచిస్తే కూటమి ప్రభుత్వం లైనింగ్ పనులు చేపట్టి భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితి తెచ్చిందన్నారు. వెంటనే ఉచిత గడ్డి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా పశుగ్రామం కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు.

# 22ఎ పెండింగ్ ఫైళ్లు రెండు వారాల్లో పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్లో సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**శ్రీ సత్య సాయి జిల్లా, జూలై 31, ప్రభాతవార్త ప్రతినిధి**

రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న 22ఎ సంబంధిత ఫైళ్లన్నింటినీ రాబోయే రెండు వారాల్లోగా పూర్తిగా పరిష్కరించాలని సంబంధిత ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులను శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రెవెన్యూ, సర్వే అధికారులకు ముఖ్యమైన ఆదేశాలు ఇచ్చారు. గతంలో 22ఎ నిషేధిత జాబితా భూముల తొలగింపు ప్రతిపాదనల ప్రక్రియ కలెక్టర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం ఆ బాధ్యతలను ఆర్డీవో లకు అప్పగించారు. ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలి. భూగర్భ జల శాఖ నుంచి ముందస్తు అనుమతి పొందితేనే కొత్త బోర్‌వెల్స్‌కు అనుమతులు ఇస్తారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా బోర్లు వేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహాశీల్దార్లకు హెచ్చరిక జారీ చేశారు. గ్రామాల్లో జరిగే భూ రీసర్వే ఎటువంటి తప్పులు లేకుండా నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలన్నారు. సర్వే బృందాల పనితీరును పెంచేందుకు జిల్లా యంత్రాంగం తరఫున ప్రత్యేక వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సర్వే పూర్తయిన వెంటనే అర్హులైన రైతులకు తప్పుల్లేని డిజిటల్ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

**- ఉదిరిపికొండ పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ తనిఖీలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**- పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారంభించిన కలెక్టర్**





పాఠశాలలో సీసీ కెమెరాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ , విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**ఉరవకొండ, జూలై 31 ప్రభాతవార్త**

పాఠశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపిక కాగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్ చాలా బాగా ఏర్పాటు చేశారని కితాబిచ్చి అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఐ.ఎఫ్.పి ప్యానల్ బోర్డును ఎలా వాడతారు, ఏవిధంగా ఉపయోగిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడితో ఆరా తీశారు. ఈ సందర్భంగా కాసేపు 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ బాగా చదువుకోవాలని ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించేందుకు కష్టపడాలన్నారు. పాఠశాలలో చక్కటి ల్యాబ్ ఉందని, మంచి ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, తహాశీల్దార్ మోహన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు.. ..అడ్డుకట్ట వేద్దాం"

**- ఆగస్టు I - ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం**

**- కిమ్స్ సవీర సీనియర్ కన్సల్టెంట్ లీడ్ మెడికల్, హెమటో ఆంకాలజిస్ట్ డా.పి.వెంకట సింహా**



కిమ్స్ సవీర సీనియర్ కన్సల్టెంట్ లీడ్ మెడికల్, హెమటో ఆంకాలజిస్ట్ డా.పి.వెంకట సింహా

**అనంతపురం, జులై 31 ప్రభాతవార్త బ్యూరో**

రాయలసీమ ప్రాంతంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో పొగాకు వినియోగం, బీడీ అలవాటు, వాయు కాలుష్యం, గనులు-రాతి క్వారీల దుమ్ము, వ్యవసాయంలో వాడే రసాయనాలు వంటి కారణాలు ఊపిరితిత్తుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయని కిమ్స్ సవీర సీనియర్ కన్సల్టెంట్ లీడ్ మెడికల్, హెమటో ఆంకాలజిస్ట్ డా.పి.వెంకట సింహ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ సంబంధిత మరణాల్లో అగ్రస్థానంలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్ భారతదేశంలో కూడా ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 1న ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన పెంచుతున్నారని చెప్పారు. అనంతపురం, గ్రామీణ ప్రాంతాల్లో బీడీ, సిగరెట్ అలవాట్లు ఇప్పటికీ విస్తృతంగా ఉన్నాయి. ఇంట్లో ఎవరో ధూమపానం చేయడం వల్ల కుటుంబ సభ్యులు కూడా పరోక్ష ధూమపానానికి గురవుతున్నారు. రాతి క్వారీల్లో పనిచేసే కార్మికులు, సిమెంట్ పరిశ్రమలు, నిర్మాణరంగం, ధూళి ఎక్కువగా ఉండే పనుల్లో పనిచేసే వారిలో ఊపిరితిత్తుల వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీర్ఘకాలం ఇలాంటి వాతావరణంలో ఉండడం క్యాన్సర్ ప్రమాదం పెంచుతుంది. రాయలసీమలో క్షయవ్యాధి (టిబీ) కేసులు కూడా అధికంగా ఉండటంతో ప్రారంభ దశలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను టిబీగా భావించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దగ్గు తగ్గకపోయినా చాలామంది ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తారు. దీంతో వ్యాధి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతోంది. ముందస్తుగా గుర్తిస్తే చికిత్స ఫలితాలు గణనీయంగా మెరుగవుతాయని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి. నిరంతర దగ్గు, కఫంలో రక్తపు చారలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, గొంతు బొంగురుపోవడం, ఆకస్మిక బరువు తగ్గడం, దీర్ఘకాలిక జ్వరం లేదా అలసట, ఎముకల నొప్పులు. 50 నుంచి 80 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు, 20 సంవత్సరాలకు పైగా ధూమపానం చేసినవారు, గత 15 సంవత్సరాల్లో ధూమపానం మానేసినవారు, గనులు, క్వారీలు, సిమెంట్, నిర్మాణ రంగాల్లో పనిచేసేవారు, తీవ్రమైన వాయు కాలుష్య ప్రాంతాల్లో నివసించే వారు వైద్యుల సలహాతో ఊపిరితిత్తుల స్క్రీనింగ్ చేయించుకోవడం మంచిది. గతంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్ లేదా బెంగళూరు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అనంతపురంలోనే పెట్ సీటీ, సీటీ ఆధారిత నిర్ధారణ, బ్రోంకోస్కోపీ, సీటీ స్కాన్ గైడెడ్ బయాప్సీ, బయోమార్కర్ పరీక్షలు, లిక్విడ్ బయాప్సీ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఆధునిక రేడియేషన్ చికిత్సలు, ఆధునిక శస్త్రచికిత్సలు వంటి సదుపాయాలు ఉన్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో అధిక భాగం నివారించదగినదే. ధూమపానం పూర్తిగా మానడం, ఇంట్లో పొగ తాగకుండా చూడడం, పనిస్థలాల్లో మాస్కులు ధరించడం, దుమ్ము-కాలుష్యాన్ని తగ్గించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. రాయలసీమలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు గ్రామస్థాయికి చేరాలి. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంస్థలు కలిసి యువతలో ధూమపానం నివారణపై చైతన్యం కల్పించాలి. ప్రతి కుటుంబం "పొగాకు లేని ఇల్లు" అనే సంకల్పం తీసుకుంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ భారాన్ని తగ్గించవచ్చు. ఈ ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక నిర్ణయం తీసుకోవాలి, ధూమపానానికి దూరం, ముందస్తు పరీక్షలకు శ్రీకారం అదే ప్రాణరక్షణకు తొలి అడుగు అని ఆయన వెల్లడించారు.